కథ

**సమస్యల వల్లే మనిషి మానసికంగా ఎదగగలడు! సమస్యలే లేని వాళ్ళకి సాహసం, తెలివీ, తక్కువగా ఉంటాయి- అని నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.**

# పెంపుడు చిలక

సంయుక్తకి ఏక్సిడెంట్ అయి కంఠనాళాలు దెబ్బతిన్న విషయం తెలియగానే చూడడానికి వెళ్ళాను. సంయుక్త తల్లిదండ్రులు కూతురి భవిష్యత్తు గురించి కుమిలి కుమిలి ఏడుస్తున్నారు. వాళ్ళని ఓదార్చడం నా తరం కాలేదు. వాళ్ళు రక్త సంబంధం లేకపోయినా నన్ను ఆ ఇంటి ఆడపడుచులా ఆదరిస్తారు. సంయుక్త తండ్రి లాయర్. తల్లి గృహిణి.

''ఆమెకు మళ్ళీ మామూలుగా మాట్లాడే స్థితి తప్పకుండా వస్తుంది. ఈలోగా డిప్రెషన్ రాకుండా చూసుకోమనండి'' అన్నాడు డాక్టర్.

ఫిజికల్‌గా ఏదైనా సమస్య వచ్చినప్పుడు మానసికంగానే ఎక్కువగా నష్టం వస్తుంది.

''అసలా ఎక్స్‌కర్షన్‌కి వాళ్ళ నాన్నే పంపించారు. నేను వద్దంటూనే వున్నాను'' అని వాళ్ళమ్మ ఏడుస్తోంది.

మనుషులు ఏ సమస్య వచ్చినా నెపం వెయ్యడానికి ఒకర్ని వెదుక్కుంటారు. తనంతే సమానమైన బాధలో వున్న భర్తని ఆమె నిందిస్తోంది. దానివల్ల ఆయన బాధ పెరుగుతోంది.

★ ★ ★

సంయుక్తని చూడడానికి నేను తరచూ వెళ్తూనే వున్నాను. వెళ్ళినప్పుడల్లా ఆమె మూగగా నన్ను చూసి రోదించేది. మాటరాని ఆ బంగారు బొమ్మని చూస్తుంటే నాకూ మనసు కలచివేసేది.

సంయుక్త చెల్లెలు స్రవంతి ఈ విషయం తెలిసి అమెరికా నుండి వచ్చింది. ఆమె సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అక్కడ పనిచేస్తోంది. ఆమెతోబాటు దేవ్ కూడా వచ్చాడు. అతనూ ఆమెతోబాటే అక్కడ ఉద్యోగం చేస్తున్నాడట. కుర్రాడి అసలు పేరు మహదేవ్‌ట. చాలా బుద్ధిమంతుడని మాట్లాడగానే తెలిసింది.

స్రవంతి చెప్పకపోయినా అతను ఆమె ఫియాన్స్ అని నాకు అర్థం అయింది.

వాళ్ళ నాన్నగారు నాతో ''స్రవంతికి ఈ ఏడు పెళ్ళి చేసేస్తాం'' అన్నారు.

''ఈ పరిస్థితుల్లోనా?'' అంది వాళ్ళమ్మగారు అభ్యంతరపెడ్తూ.

''నీకు లోకం తెలీదు. వాళ్ళిద్దరూ చాలా చనువుగా వుంటున్నారు. ఎక్కువ రోజులు వదిలి పెట్టకూడదు'' అన్నారాయన.

ఆవిడ కూడా ఆ మాటకి సమాధానపడినట్లే కనిపించింది. ఆ తర్వాత ఒంటరిగా నాతో ''స్రవంతికి తనకన్నా ముందే పెళ్ళి జరిపిస్తే సంయుక్త బాధపడ్తుందేమో అన్నదే నా భయం'' అందావిడ.

''ఈ కాలం పిల్లలు చాలా ప్రాక్టికల్. అలా ఆలోచిస్తే.. స్రవంతికి వచ్చే ఏడూ...ఆ వచ్చే ఏడూ కూడా పెళ్ళి చేస్తే

ం నే

గ్యారంటీ ఏవిటి వదినా?'' అన్నాను.

సంయుక్తకి ఈ విషయం చెప్తే ఆమె మొహంలో సంతోషమే కనిపించింది. వీలైనంత త్వరగా చెయ్యమని చెప్పడానికి ప్రయత్నించింది.

అందరూ సంతోషించారు. దేవ్ పేరెంట్స్‌ని కలవాలనుకున్నారు.

★ ★ ★

మర్నాడు మా ఇంటికి సంయుక్త తల్లిదండ్రులు కబురు లేకుండా వచ్చేసరికీ ఆశ్చర్యపోయాము.

''విద్యా..ఇదేవిటీ..దేవ్ ఇలా అన్నాడూ..'' అని ఆవిడ తల పట్టుకుంది.

''ఏం..మన స్రవంతిని చేసుకోనన్నాడా?'' అన్నాను.

అన్నయ్య సమాధానం చెప్పారు ''సంయుక్తని చేసుకుంటానన్నాడు!''

ఈసారి నా నోట మాట రాలేదు.

''రాత్రి స్రవంతీ, దేవ్ చాలాసేపు మాట్లాడుకున్నారు. తర్వాత మా దగ్గరకొచ్చి ఈ విషయం చెప్పారు. దేవ్‌కి సంయూ చాలా నచ్చిందిట!'' అందావిడ.

''ఇది ఆనందపడాల్సిన విషయమేగా వదినా. మీ సమస్యే సంయూ కదా! ఆమె పెళ్ళి ద్వారా ఇది తీర్తోంది'' అన్నాను ఆనందంగా.

''లేదమ్మా..నా దృష్టిలో సంయుక్తకి మాట వచ్చిన తర్వాతే వివాహం చెయ్యడం మంచిది!'' అన్నారు అన్నయ్య.

''డాక్టర్ కానీ అలా చెప్పారా?'' అని మా వారు అడిగారు.

''లేదు..సంయుక్తకి ఇప్పుడు ఒక లోపం వుంది. అది త్వరలో సర్దుకుంటుందని నా నమ్మకం. లోపం వుండగా పెళ్ళి చేస్తే అతని దయకి ఆ పిల్ల జీవితాంతం కృతజ్ఞతతో బ్రతకాల్సొస్తుంది. అది నాకు ఇష్టం లేదు. పైగా యువక రక్తం వేడిలో చేసేసుకున్నా ఆ తర్వాత అతను తొందరపడ్డానని పశ్చాత్తాపపడ్తేనో. నా బిడ్డ పరిస్థితి ఏవిటి?'' అన్నారు.

ఆయన తండ్రి హృదయం నాకర్థమైంది. కానీ- ఈ పరిస్థితుల్లో దేవ్ సంయుక్తని చేసుకోడానికి ముందుకు రావడం మాత్రం వరమే!

అందరం కలిసి ఆలోచించాం.

చివరికి మా వారు ''సంయూ చిన్నపిల్ల కాదు..తననే అడుగుదాం'' అన్నారు.

ఆ మాటకి వాళ్ళూ ఆమోదించారు.

★ ★ ★

సంయుక్తా దేవ్‌ల పెళ్ళి చాలా సింపుల్‌గా జరిగిపోయింది.

స్రవంతి చాలా ఉత్సాహంగా అన్ని పనులూ మీద వేసుకుని చేసింది.

పెళ్ళయ్యాకా ఆమె అమెరికా వెళ్ళిపోయింది. దేవ్ ఇక్కడే జాబ్ చూసుకుంటానని ఉండిపోయాడు.

కొద్దిరోజుల్లోనే అతనికి మంచి జాబ్ వచ్చింది. సంయుక్తని కాపురానికి తీసుకెళ్ళాడు.

సంయుక్త చాలా ఆనందంగా వుందని తల్లిదండ్రులు ఫోన్లో నాతో చెప్పినప్పుడు చాలా సంతోషించేదాన్ని.

ఆషాఢమాసం పట్టింపు వుండడంతో ఆమెని పుట్టింటికి తీసుకొచ్చారు.

దేవ్ ఆమెని వదిలిపెట్టి వుండలేక రెండు రోజులకి ఒకసారి కేంప్ వేయించుకుని ఆమెని తనతో తీసుకెళ్ళేవాడు.

వాళ్ళ దాంపత్యం చూస్తుంటే కన్నుల పండుగగా వుండేది.

సంయుక్త మాట్లాడలేకపోయినా దేవ్ ఆమె మనసు తెలుసుకుని అన్నీ చేసేవాడు.

ఆమెని చూడ్డానికి ఒకసారి వాళ్ళమ్మతో కలిసి వాళ్ళింటికి వెళ్ళాను.

దేవ్ వంటగదిలో వున్నాడు. వాళ్ళిద్దరూ కలిసి వంట చేస్తున్నారు. ఎంతో ముచ్చటగా అనిపించింది.

సంయుక్త మమ్మల్ని కళ్ళతోనే ఆహ్వానించి


కూర్చోమని మాతో సైగలతో చిన్న చిన్న శబ్దాలతో కమ్యూనికేట్ చేస్తోంది.

''సంయూ..టాబ్లెట్స్ వేసుకున్నావా? సంయూ..ఇలారా..నీకేం తెలీదు..ఇది ఫ్రిజ్‌లో పెట్టేటప్పుడు మూత పెట్టాలి. సంయూ..నా సెల్ వెతికియ్యి...సంయూ..ఇది కాస్త టేస్ట్ చేసి ఎలా వుందో చెప్పు!'' అంటూ దేవ్ ఆమెని అస్తమానం పిలుస్తూనే వున్నాడు.

ఆ తర్వాత అతనొచ్చి కూర్చుని మాతో మాట్లాడుతున్నప్పుడు కూడా సంయూ చెయ్యి పట్టుకునో, ఆమె చెక్కిలి నిమురుతూనో మాట్లాడడం నేను గమనించాను.

బయటకొచ్చాకా..''మా అల్లుడికి సంయూ అంటే ప్రాణం'' అంది వదిన.

''తెలుస్తూనే వుందిగా'' అని నవ్వాను.



★ ★ ★

అనుకోకుండా దేవ్‌కి ఫారిన్‌లో మంచి ఆఫర్ వచ్చిందనీ, సంయుక్తని తీసుకుని వెళ్ళిపోతున్నాడనీ ఒకనాడు అన్నయ్య ఫోన్ చేసి చెప్పారు.

మేం సంయూనీ దేవ్‌నీ భోజనానికి పిలిచాం.

దేవ్ సంయుక్తని దగ్గరగా తీసుకునే మాట్లాడాడు. ఆమెకి ఏం ఇష్టమో ఏం తింటుందో కూడా అతనే చెప్తున్నాడు.

వాళ్ళు వెళ్ళాకా నాకూ మా వారికీ మధ్యన సర్వెంట్ డుమ్మాలు కొట్టడం గురించి వాదన మొదలయి, ఆయన ఆ పిల్లనే సమర్థించడంతో తారాస్థాయికి చేరుకుందది.

ఇద్దరం అరుచుకుంటుంటే మా అబ్బాయొచ్చి ''ఇరుగు పొరుగు వాళ్ళంతా బయట నిలబడి ఏమౌతోందని అడుగుతున్నారు. వెళ్ళి చెప్పండి'' అన్నాడు హేళనగా.

మేం ఇద్దరం ఆపేసి నవ్వుకున్నాం.

''ఇద్దరిలో ఎవరివీ చిన్న గొంతులు కావు'' అన్నాను సిగ్గుపడుతూ.

''ఒకళ్ళు మాట్లాడేటప్పుడు ఇంకొకరు మౌనంగా వినడం నేర్చుకోవాలి మనం'' అన్నారాయన.

నాకూ సంయుక్తా దేవ్‌లు గుర్తొచ్చారు.

★ ★ ★

సంయుక్త మూడేళ్ళ తర్వాత ఇండియా వచ్చింది. ఆమెకి ఇప్పుడు చిన్న సర్జరీ చేయడం వలన మాట్లాడడం వచ్చిందిట.

ఈ వార్త విన్నప్పటినుండీ నేను సంయుక్తని చూడాలని తహతహలాడాను.

మేం కలిసినప్పుడు ఆమె చక్కగా మాట్లాడింది. కానీ వాళ్ళమ్మా నాన్నలు మాత్రం విచారంగా వున్నారు.

కారణం స్రవంతి వచ్చాకా చెప్పింది.

సంయుక్త విడాకులకి అప్లై చేసిందట.

ఇది విని షాక్ అయ్యాము.

కారణం తెలిసాక ఇంకా షాక్ అయ్యాము.

''సంయూ ఎందుకిలా?'' అని అడిగితే,

''ఆంటీ, దేవ్‌కి నేనంటే విపరీతమైన ప్రేమ! ఎంతంటే..తన పెంపుడు జంతువుల మీదున్నంత ప్రేమ. అవి అతని ఆర్డర్స్ వింటాయి. అతని మీదపడి పూసుకునీ, రాసుకునీ తమ ప్రేమని చూపిస్తాయి. కానీ తమ నోరు తెరిచి ఎదిరించవు. ఒకవేళ అవి అరిచినా మానవుడు తనకి అనువుగానే వాటి భాషని అనువదించుకుంటాడు. అందుకే వాటిని ప్రేమిస్తాడు. అలాగే దేవ్ కూడా నన్ను 'పెంపుడు పెళ్ళాం'గా ప్రేమించాడు. కానీ నా భావాలు..నా ఆలోచనలూ అతనికి చెప్పడం మొదలు పెట్టాకా, అతన్ని ప్రశ్నించడం మొదలు పెట్టాకా అతనికి నచ్చడం మానేసాను. 'మీ చెల్లెలు ఇలాగే అన్నింటికీ ఆర్గ్యూ చేసి నన్ను వేధించేది. అందుకే నిన్ను చేసుకున్నాను. నీకు అన్నీ ఇస్తున్నానుగా ఎందుకు ఆర్గ్యూ చేస్తావ్?' అనేవాడు.

నా 'మూగతనం' అతనికి వరం. ఈ విషయం అర్థం అవడానికి నాకు ఎక్కువ కాలం పట్టలేదు. కానీ మారుతాడేమో అని ఓపిగ్గా ఎదురు చూసాను. ఆంటీ! అంకుల్‌తో మాట్లాడకుండా, పోట్లాడకుండా మీరు జీవితాన్ని ఊహించగలరా?'' అడిగింది.

ఈసారి నేను మూగబోయాను.

''నాకు ఈరోజు డిన్నర్‌కి బయటకి వెళ్ళాలనుందీ- అనే సెంటెన్స్‌కీ 'మనం ఈరోజు డిన్నర్‌కి బయటకి వెళ్ళాలీ' అనే సెంటెన్స్‌కీ చాలా తేడా వుంది ఆంటీ! ఛాయిస్ లేని ఆ ప్రేమ నాకొద్దు. నా తిండీ, డ్రెస్సూ, పుట్టబోయే పిల్లలూ అన్నీ తానే నిర్ధారించడం నేను భరించలేకపోయాను.

ప్రేమ అంటే..తాత్కాలికంగా మనం చంపుకునే అహం! అది శాశ్వతంగా చెయ్యాలంటే ఎవరివల్లా కాదు. అందుకే మనుషులు కుక్కల్నీ మొక్కల్నీ ప్రేమిస్తే..ఏ గొడవా వుండదు. వాటికి 'ఈగోలు' వుండవు. ఆధారపడి నోరు విప్పకుండా వుంటాయి! వీళ్ళకి పెంపుడు చిలకలే కావాలి. భార్యలు కాదు''

నేను మా వారి వైపు చూసాను.

ఆయన కళ్ళతోనే సమాధానం ఇచ్చారు. సంయుక్త ఎనాలసిస్..నిర్ణయం కరక్టే అని!

ఇంటికి వెళ్ళేటప్పుడు నేను నిశ్శబ్దంగా ఆలోచిస్తూ కూర్చున్నాను.

మా అమ్మమ్మ తరం కాదిది మొగుడితో మాట్లాడకుండానే కాపురం చేసి పిల్లల్ని కనడానికి. ఇద్దరూ చదువులో, తెలివిలో అన్నింటిలో సమానమే. దేవ్ లాంటి మగవాడు 'నేనింతగా ప్రేమిస్తే నన్ను నా భార్య మోసం చేసింది' అని బాధపడ్తాడే కానీ లాజికల్‌గా ఆలోచించడం లేదు. ఎప్పటికి మారుతారూ?

''సరదాగా కాసేపు పోట్లాడు..బోర్‌గా వుంది'' అన్న మా ఆయన మాటలకి ఆలోచనల్లోంచి బయటపడి నవ్వాను. ♣

**బలభద్రపాత్రుని రమణి**